# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శనివారం | 07 ఫిబ్రవరి, 2026 | పేజీలు :08


# బిఆర్ఎస్, సిపిఐ పొత్తుతోనే అభివృద్ధి

సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు



**ప్రజాపక్షం/రామకృష్ణాపూర్ :** క్యాతనపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి, ప్రజల సంక్షేమం లక్ష్యంగా బిఆర్ఎస్–సిపిఐ పార్టీల పొత్తు ఏర్పడిందని సిద్దిపేట ఎంఎల్ఎ హరీష్ రావు స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాజీవ్ చౌక్ చౌరస్తాలో మాజీ ఎంఎల్ఎ బాల్క సుమన్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు కార్మికులు, పేదలకు భరోసా ఇచ్చాయని, ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్, సిపిఐ కూటమి విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గతంలో సింగరేణి సంస్థ కోల్ ఇండియాకే ఆదర్శంగా ఉండేదని, కానీ కాంగ్రెస్ పాలనలో సింగరేణిని దివాలా తీయిస్తున్నారని మండిపడ్డారు. బిఆర్ఎస్, సిపిఐ ఐక్యంగా సింగరేణి సంస్థను కాపాడుకుంటామని హామీ ఇచ్చారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ కార్మికులు, పేదల హక్కుల పరిరక్షణే ఈ పొత్తు ప్రధాన లక్ష్యమని, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఐక్య వేదికను గెలిపించాలని కోరారు. క్యాతనపల్లి అభివృద్ధి కోసం బిఆర్ఎస్, సిపిఐ అభ్యర్థులను ఆదరించాలని పిలుపునిచ్చారు. 1, 2, 6, 8, 12, 18, 22 వార్డుల్లో సిపిఐ అభ్యర్థులకు, మిగిలిన వార్డుల్లో బిఆర్ఎస్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్, బిఆర్ఎస్ నాయకులు డాక్టర్ రాజా రమేష్, సిపిఐ, బిఆర్ఎస్ పార్టీలకు చెందిన జిల్లా, మండల, మున్సిపల్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిర్మల్ బల్దియాపై ‘అప్పాల’ మార్కు స్కెచ్..!

## హస్తం గెలుపే లక్ష్యంగా అప్పాల గణేష్ వ్యూహాలు..!

**ప్రజా పక్షం/నిర్మల్ :** నిర్మల్ పురపాలక ఎన్నికల రణం నేడు పతాక స్థాయికి చేరుకుంది. తెలంగాణ రాజకీయ పటంలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న నిర్మల్ పట్టణంలో, ఈసారి ఎలాగైనా బల్దియా పీఠాన్ని దక్కించుకోవాలని కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ గెలుపు బాధ్యతను,వ్యూహరచనను రాజకీయ చాణక్యుడిగా పేరుగాంచిన అప్పాల గణేష్ చక్రవర్తి భుజానికెత్తుకోవడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది. అప్పాల గణేష్ అంటే కేవలం ఒక నాయకుడు మాత్రమే కాదు, నిర్మల్ మున్సిపల్ పరిధిలోని ప్రతి గల్లీపై, ప్రతి ఓటరు నాడిపై స్పష్టమైన అవగాహన ఉన్న మేధావిగా ఆయనకు గుర్తింపు ఉంది. రాజకీయాల్లో ఆయన వేసే ప్రతి అడుగు ఒక వ్యూహమని, ఆయన స్కెచ్ గీశారంటే ప్రత్యర్థులకు ఓటమి తప్పదనే నమ్మకం రాజకీయ విశ్లేషకుల్లో సైతం బలంగా నాటుకుపోయింది. “అప్పాల గణేష్ రంగంలోకి దిగితే.. విజయం వరించాల్సిందే” అన్న చందంగా సాగుతున్న ప్రస్తుత ప్రచార సరళి, విపక్షాల్లో వణుకు పుట్టిస్తోంది. దశాబ్దాలుగా తరువాయి 2లో







# విభిన్న రంగాల్లో మహిళలకు చక్కటి ఆదాయ మార్గాలు




**కాకినాడలో కరీంనగర్ మహిళలకు అలంకరణ చేపల పెంపకంపై శిక్షణ**

**అభినందించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**ప్రజాపక్షం/కరీంనగర్ :** మహిళలు విభిన్న రంగాల్లో ఉపాధి మార్గాలను ఎంచుకుని ఆర్థిక సాధికారత సాధించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జిల్లా మత్స్యశాఖ సహకారంతో కరీంనగర్ మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘానికి చెందిన 19 మంది సభ్యులు అలంకరణ చేపల పెంపకం, ఉత్పత్తి రంగంలో ఆంధ్రప్రదేశ్ లోని కాకినాడలోని రాష్ట్ర ఫిషరీస్ టెక్నాలజీ సంస్థలో మూడు రోజుల శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని క్యాంపు కార్యాలయంలో కలిసి స్వయంగా తయారు చేసిన అక్వేరియం, అలంకరణ చేపను అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ మహిళలు కొన్ని రంగాలను మాత్రమే ఉపాధి మార్గాలుగా ఎంచుకుంటున్నారని, దీనివల్ల పోటీ ఎక్కువగా ఉంటుందని అన్నారు. విభిన్న రంగాల్లో చక్కటి ఉపాధి, ఆదాయ మార్గాలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. అలంకరణ చేపల ఉత్పత్తి, పెంపకంలో మంచి డిమాండ్ ఉన్నందున కరీంనగర్ జిల్లా మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులను ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో శిక్షణకు పంపించినట్లు తెలిపారు. అక్వేరియంలో పెంచుకునే అలంకరణ చేపల రకాలు, సంతాన ఉత్పత్తి విధానం, పెంపకం, ఆహారం, పెంచడానికి అనువైన నీరు, వాతావరణం వంటి విధానాలపై వీరు శిక్షణ పూర్తి చేసుకున్నారని తెలిపారు. అలంకరణ చేపలకు అందించాల్సిన ఆహారం స్వయంగా తయారు చేసే విధానం, అక్వేరియంల తయారీ, చేపల ప్యాకింగ్ వంటి అనేక విషయాల్లో సంఘం సభ్యులు శిక్షణ పొందారని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి విభిన్న రంగాల్లో మరింత మందికి శిక్షణ ఇప్పించి మహిళల ఆర్థిక సాధికారతకు కృషి చేస్తామని వెల్లడించారు. జిల్లా మత్స్యశాఖ అధికారి విజయ భారతి, ఫీల్డ్ ఆఫీసర్ అశోక్, ఎఫ్.డి.ఓ మంజుల పాల్గొన్నారు.

# ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. శుక్రవారం రోజున పెద్దపల్లి మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శాంతినగర్‌లోని పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఎస్సైలు, సీఐలు, ఏసీపీలు, డీసీపీతో సమావేశమై ఎన్నికల నిర్వహణపై చర్చించి అవసరమైన ఆదేశాలు, సూచనలు జారీ చేశారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అత్యంత కీలకమైనవని, ప్రతి ఓటరు ఎలాంటి భయం,ఒత్తిడి లేదా ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తన ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ యంత్రాంగం పూర్తి స్థాయిలో భద్రతా చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు శాంతియుత వాతావరణంలో నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసులు అన్ని విధాలుగా ఏర్పాట్లు తరువాయి 2లో

# అభివృద్ధే ప్రధాన లక్ష్యం

ఎమ్మెల్యే సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాల/రాయికల్ :** జగిత్యాలను బ్రహ్మాండంగా అభివృద్ధి చేయడమే నా ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని మోతె రోడ్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో శుక్రవారం సంజయ్ కుమార్ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2021లో జగిత్యాల పట్టణంలో 12 జోన్లను 121 సర్వే నంబర్లుగా మార్చడం జరిగిందన్నారు. యావర్ రోడ్డు సముదాయాలను రెసిడెన్సియ కమ్యూనికేషన్ జోన్ నుంచి కమర్షియల్ జోన్‌గా మార్చ డం జరిగిందన్నారు. జోన్ల మార్పుతోనే నూతన నిర్మాణాలకు చట్టబద్ద అనుమతులు వస్తున్నాయన్నారు. జగిత్యాల పట్టణ ప్రజల చిరకాల కోరిక యావర్ రోడ్ విస్తరణ అని పేర్కొన్నారు. గతంలో సీనియర్ నాయకుడు మంత్రిగా ఉన్నప్పటికి యావర్ రోడ్డును వెడల్పు చేయలేదన్నారు. గతంలోనే సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి యావర్ రోడ్డు తరువాయి 2లో

# నిర్మల్ బల్దియాపై 'అప్పాల' మార్కు స్కెచ్..!

(మొదటి పేజీ తరువాయి)

నిర్మల్ పట్టణంతో అప్పాల కుటుంబానికి ఉన్న విడదీయలేని అనుబంధం, ఆపదలో ఉన్నవారిని ఆదుకునే గుణం నేడు కాంగ్రెస్ పార్టీకి అతిపెద్ద అస్త్రంగా మారాయి. ఎప్పుడూ ప్రజల మధ్య ఉంటూ, వారి కష్ట సుఖాల్లో పాలుపంచుకునే ఆప్పాల గణేష్ వ్యక్తిత్వం, ఈ ఎన్నికల్లో పార్టీకి ప్రధాన బలంగా నిలుస్తోంది. పట్టణ అభివృద్ధికి ఒక స్పష్టమైన విజన్ కలిగిన నాయకుడిగా ఆయన ప్రచారాన్ని,ముందుకు తీసుకెళ్తున్నారు. కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా అప్పాల కుటుంబం మొత్తం క్షేత్రస్థాయిలో కష్టపడుతుండటంతో,నిర్మల్ బల్దీయాపై హస్తం జెండా ఎగరడం కేవలం కాలం నిర్ణయించాల్సిన ప్రక్రియ మాత్రమేనని పట్టణవాసులు చర్చించుకుంటున్నారు. ప్రత్యర్థుల ఎత్తుగడలను చిత్తు చేస్తూ, ఓటర్లను ఆకట్టుకోవడంతో ఆయన ప్రదర్శిస్తున్న చొరవ ఆమోఘం. ఈ ఎన్నికల రణక్షేత్రంలో అప్పా గణేష్ మార్కు రాజకీయ వ్యూహాలు, నిర్మల్ పురపాలక సంస్థ భవిష్యత్తును సరికొత్తగా ఆవిష్కరించబోతున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. హస్తం పార్టీకి ఆయన ఒక ట్రబుల్ షూటర్‌గా మారి, పార్టీ గెలుపు గుర్రాలను విజయతీరాలకు చేర్చే బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు.

**మూడు తరాల నమ్మకం.. అప్రతిహత వారసత్వం..**

నిర్మల్ బల్దీయా చరిత్రలో అప్పాల కుటుంబానిది చెరపలేని ముద్ర, ఒకే కుటుంబం నుండి ముగ్గురు చైర్మన్లుగా బాధ్యతలు చేపట్టడం ఆ కుటుంబంపై ప్రజలకున్న అచంచలమైన నమ్మకానికి నిదర్శనం.తొలుత అప్పాల నర్సయ్య 1981–82 మధ్య కాలంలో మున్సిపల్ చైర్మన్‌గా పట్టణ అభివృద్ధికి బలమైన పునాదులు వేశారు.ఆ తర్వాత అప్పాల నర్సయ్య కోడలు అప్పాల అనురాధ మహేష్ 2006లో చైర్‌పర్సన్‌గా ఎన్నికై, ఐదేళ్ల పాటు పట్టణాన్ని ప్రగతి పథంలో నడిపి,మహిళా నాయకత్వానికి వన్నె తెచ్చారు. ఇక ముడో తరానికి ప్రతినిధిగా అప్పాల గణేష్ చక్రవర్తి 2014–19 వరకు చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించి, నిర్మల్ పట్టణ రూపురేఖలను మార్చడంతో కీలక పాత్ర పోషించారు. ఇలా మూడు తరాలుగా ప్రజలతో మమేకమైన ఈ కుటుంబంపై ఉన్న గౌరవమే ఇప్పుడు కాంగ్రెస్ కు ప్రధాన ఓటు బ్యాంకుగా మారుతోంది.

**ఏకమైన దిగ్గజాలు... హోరెత్తుతున్న ప్రచారం..**

అప్పాల గణేష్ గెలుపు గుర్రంగా బరిలో ఉన్న వేళ, నిర్మల్ రాజకీయ ఉద్దండులంతా హస్తం పార్టీ పక్షాన ఏకం కావడం విశేషం, మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, తనదైన శైలిలో వార్డులో పర్యటిస్తూ అప్పాల గణేష్ వ్యూహాలకు రాజకీయ పదును పెడుతున్నారు. అదేవిధంగా మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి తన అపార అనుభవంతో ప్రచార పర్వంలో దిశానిర్దేశం చేస్తున్నారు. మాజీ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు క్షేత్ర స్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ ప్రచారాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. ఈ ముగ్గురు ఉద్ధండుల మద్దతు అప్పాల గణేష్‌కు కొండంత అండగా నిలుస్తోంది.

**వార్డులలో హోరెత్తుతున్న నినాదాలు..**

ప్రస్తుతం నిర్మల్ పట్టణంలోని ప్రతి వార్డులోనూ కాంగ్రెస్ ప్రచారం హోరెత్తుతోంది.అప్పాల గణేష్ వేస్తున్న వ్యూహాత్మక అడుగులు ప్రత్యర్థులను ఆత్మరక్షణలో పడేశాయి.అప్పాల కుటుంబ సభ్యులు స్వయంగా ప్రతి ఇంటికీ తిరుగుతూ ఓటర్లను కలుసుండటంతో పట్టణంలో పాజిటివ్ వేవ్ కనిపిస్తోంది. పట్టణ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అప్పాల కుటుంబమే సరైన ప్రత్యామ్నాయమని ప్రజలు బలంగా నమ్ముతున్నారు. అప్పాల గణేష్ రాజకీయం, దిగ్గజ నేతల అండ, మూడు తరాల వారసత్వం వెరసి నిర్మల్ బల్దీయాపై హస్తం జెండా ఎగురవేయడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

చేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ, పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ సిఐ అనిల్ కుమార్, ఎస్సై లక్ష్మణ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను సందర్శించిన ఎఇ



**ప్రజాపక్షం/ఇల్లందకుంట :** ఇల్లందకుంట మండలంలోని గడ్డివానిపల్లి గ్రామ సర్పంచ్ గడ్డిశ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏఈ దివ్య మిషన్ భగీరథ పైప్ లైన్లను గతంలో ఉన్నటువంటి డ్యామేజీలను లీకేజీలను వాటర్ ట్యాకర్ ను సందర్శించి ఎలాంటి లీకేజీ డ్యామేజ్ లు ఉన్న వెంటనే మరమత్ చేయాలని వాటర్ వృధా కాకుండా చూసుకోవాలని ప్రతి కుటుంబానికి మిషన్ భగీరథ నీరు అందే విధంగా సరఫరా అందించాలని కొన్ని కొత్త కలెక్షన్ వెంటనే మంజూరు చేయాలని గ్రామ సర్పంచ్ గడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఏఈ దివ్య మాట్లాడుతూ, మిషన్ భగీరథ పరంగా ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకు వచ్చిన వెంటనే సమస్య సాధనకు కృషి చేస్తామని తెలిపారు. గ్రామ సర్పంచ్, ప్రజలు ఏఈ ని శాలువాతో సన్మానించడం జరిగిందన్నారు.

## అభివృద్ధే ప్రధాన లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)



విస్తరణ తీసుకవెళ్లడం జరిగిందని వివరించారు. కరీంనగర్ జిల్లా గుమ్లాపూర్ సభలో జగిత్యాలకు సంబంధించిన యావర్ రోడ్డు విస్తరణ, ఇంటిగ్రేటెడ్ స్కూల్, కేంద్రీయ విశ్వ విధ్యాలయం, మినీ స్టేడియంకు స్థలం ఇస్తామని బహిరంగ సభలో సీఎం హామి ఇచ్చారన్నారు. అభివృద్ధి పనులకు హామి ఇచ్చిన సీఎంకు జగిత్యాల జిల్లా పక్షాన ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యావాదాలు తెలియజేశారు. ఈ సమావేశంలో నాయకులు గట్టు సతీష్, కొలుగూరి దామోదర్ రావు, గోళి శ్రీనివాస్, ఐల్నేని సురేందర్ రావు, రౌతు గంగాధర్, చెట్‌పెల్లి సుదాకర్, బొడ్ల జగదీష్, కోల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

**మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి**

మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో ముందుండాలని జగిత్యాల ఎమ్మెల్యే డా.ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారంరాయికల్ మండల ఆలూరు, రాజ్ నగర్ గ్రామాల్లో మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి 10 లక్షల చొప్పున మంజూరు కాగా భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జగిత్యాల వారు మాట్లాడుతూమహిళలు ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, విద్యారంగం, వైద్య రంగం మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అధికార పార్టీ అండతో అభివృద్ధి సాధ్యం అవుతుంది అన్నారు. గ్రామలలో ప్రభుత్వ భూములు అందుబాటులో ఉండటంతో మహిళా సంఘాల శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టాలని మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులు ప్రభుత్వానికి ఎంతో కాలంగా విజ్ఞప్తి చేస్తున్న నేపథ్యంలో ప్రజా ప్రభుత్వం ఈనిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు నల్లాల స్వామి, భారతపు రాజేష్, ఉప సర్పంచ్‌లు సల్ల మహేష్, శ్రీనివాస్, మండల నాయకులు రవీందర్ రెడ్డి, కోల శ్రీనివాస్, మోర హనుమండ్లు, గన్నె రాజిరెడ్డి భాస్కర్ రావు సురేందర్‌రెడ్డి రామ్‌రెడ్డి, గ్రామ మండల నాయకులు పాల్గొన్నారు.

# కేసుల పట్ల పోలీసుల నిర్లక్ష్యంపై పోరాటం

### కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం



**ప్రజాపక్షం/కరీంనగర్ :** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కేసులపై బాధితులకు న్యాయం చేయడంలో జిల్లాలోని పోలీసు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్ అన్నారు. మంకమ్మతోటలోని జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో 261 ఎస్సీ ,ఎస్టీ, కేసులకు ఎఫ్ఐఆర్ దశలో 154 కేసులు ఉన్నాయని, 2024 నుండి 2026 వరకు ఛార్జ్ షీట్ నమోదైన కేసులు కేవలం 12 మాత్రమే ఉన్నాయని, శిక్షలు పడిన కేసులు కేవలం ఒకటి మాత్రమే ఉందన్నారు. ఇతర పెండింగ్ కేసులు 94 ఉన్నాయని ఈ విధంగా సకాలంలో కేసులు విచారణ పూర్తి చేసి కోర్టులకు సాక్షాదారాలను సమర్పించడంలో పోలీస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. రామడుగు మండలం గోపాలరావుపేట గ్రామానికి చెందిన భూతం భాగ్యమ్మ 2024 జూన్‌లో సంవత్సరంలో కేసు నమోదయి నప్పటికీ 2026 సంవత్సరం వరకు చార్జిషీట్ దాఖలు చేయలేదని, ఇంత నిర్లక్ష్యం, జాప్యం ఎందుకని ప్రశ్నించారు. ఈ కేసులో నిందితుల నుండి బాధితులకు ప్రాణ హాని ఉందని అనేక సార్లు పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసిన కనీసం రక్షణ కల్పించలేక పోయారని విమర్శించారు. క్రైమ్ నెంబర్ 124/2024 కేసులోని నిందితులే మళ్ళీ 2025వ సంవత్సరంలో మిరియాల కృష్ణమూర్తి, నర్సింహులపై హత్యాయత్నాన్ని పాల్పడినారని ఈ విధంగా దళితులపై నిరంతరం దాడులు దౌర్జన్యాలు జరుగుతుంటే పోలీసులు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఎస్సీ ఎస్టీలకు షెడ్యూల్ కులాల షెడ్యూల్ తెగల అత్యాచారాల నిరోధక చట్టం 1995 నిబంధనల ప్రకారం బాధితులకు రక్షణ లైసెన్సుల గన్నులు ఇవ్వాలని బాధితుల బస్తీని పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహించి నీళ్ళ, బట్టలు, ఆశ్రయం వైద్యం ప్రభుత్వ రక్షణ చర్యలు చేపట్టాలని చట్టంలో ఉన్నప్పటికీ ప్రభుత్వం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బాధితులు భూతం మల్లేష్, కళ్లెం శివాజీ, నర్సింహులు, మిరియాల కృష్ణమూర్తి ఉన్నారు.

## పాఠశాలకు ఫ్యాన్ వితరణ



**ప్రజాపక్షం/వీణవంక :** మండలంలోని కొండపాక గ్రామంలో శుక్రవారం రానున్న వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని అంగన్‌వాడీ కేంద్రానికి 6వ వార్డు సభ్యుడు కత్తి సురేష్ ఫ్యాన్ అందజేశారు. కొండపాక అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఫ్యాన్ లేకపోవడంతో రానున్న వేసవికాలంలో విద్యార్థులు ఇబ్బందులు పడతారని గ్రహించి తన స్వంత ఖర్చులతో వార్డు సభ్యుడు సురేష్ సర్పంచ్ దాట్ల వీర స్వామితో కలిసి అంగన్‌వాడీ టీచర్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కుడిపెల్లి మల్లీశ్వరి, మాధవి తదితరులున్నారు.



## నాల్గవ వార్డు సమస్యలు తీరాలంటే సిపిఐకి ఓటేయండి

### వేములవాడ నాలుగో వార్డ్ మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థిగా సిపిఐ కడారి రాములు

**ప్రజాపక్షం/ వేములవాడ:** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా వేములవాడ పట్టణంలోని నాలుగో వార్డు నుండి పోటీ చేస్తున్న సిపిఐ పార్టీ అభ్యర్థి కడారి రాములు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిపిఐ పార్టీ సిద్ధాంతలకు కట్టుబడి ఉంటుందని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం సాగించి సమస్యల సాధనకు కట్టుబడి ఉంటానని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కొరకు కృషి చేస్తున్న సిపిఐ నిరంతరం పేద ప్రజల కష్టాల పట్ల స్పందిస్తుందని, నాలుగో వార్డ్‌లో ఉన్న సమస్యల సాధన కోసం కృషి చేస్తానని అన్నారు. వార్డ్ ప్రజల మద్దతుతో ఈ సారి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజలు మహిళలు, సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న మాక్ పార్లమెంట్




**ప్రజాపక్షం/వీర్నపల్లి :** మండల కేంద్రంలోని పీఎంశ్రీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులు స్పీకర్, ప్రధాని, మంత్రులు, ప్రతిపక్ష నాయకుల పాత్రలను స్వయంగా పోషిస్తూ పార్లమెంటు విధానాలను ప్రదర్శించారు. దేశాభివృద్ధి, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమం, వ్యవసాయం తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల ఎంఈఓ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం సమర్థవంతంగా నిర్వహించారని, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని అభినందించారు. ఇలాంటి వినూత్న కార్యక్రమాలు ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరుస్తాయని తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ వీర్నపల్లి సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు జి తుకారాం, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.రజిత, ఉపాధ్యాయులు ప్రవీణ, మౌనిక, మనోజ్ కుమార్, గంగ శ్రీ, సంధ్య, స్వర్ణలత, పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల బలోపేతానికి మరో ముందడుగు

### సర్పంచ్ మల్లారపు జోత్స్న

**ప్రజాపక్షం/వీర్నపల్లి :** మండల కేంద్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతానికి మరో ముందడుగు పడిందని సర్పంచ్ మల్లారపు జోత్స్నఅరుణ్‌కుమార్ అన్నారు. వీర్నపల్లి గ్రామ మహిళ సమాఖ్య భవన నిర్మాణానికి పాలకవర్గ ప్రతినిధులు, మండల అధికారులతో కలసి శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ ఆర్ఈజీఎస్) నిధుల నుండి పది లక్షల రుపాయాలు మంజూరైనట్లు తెలిపారు. మహిళల అభివృద్ధి కోసమే ప్రభుత్వం నిధులను కేటాయించిదని, భవన నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తే మహిళా సంఘాలకు ఒక శాశ్వత వేదిక లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జక్కుల నరేష్, ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్, ఎమ్మార్వో ముక్తార్ పాషా, ఎంపీడీవో శ్రీలేఖ, ఏపిఓ శ్రీహరి, ఏపిఎం దేవరాజు, బ్యాంక్ మేనేజర్ సంతోష్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భూత శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ చంద్రమౌళి, బీజేపి పార్టీ మాజీ మండల అధ్యక్షులు మల్లేశం, మహిళా సంఘం అధ్యక్షులు, సీఏలు, మహిళలు పాల్గొన్నారు.

## రా రైస్ మిల్లుల అధ్యక్షుడిగా ప్రవీణ్ కుమార్



ప్రజాపక్షం/జగిత్యాల : జగిత్యాల జిల్లా రా రైస్ మిల్లుల నూతన కార్యవర్గాన్ని సభ్యులు శుక్రవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పోచమల్ల ప్రవీణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా రాచకొండ విజయ్, కోశాధికారిగా నాగేందర్ రెడ్డి నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా ఇరుకుల్ల విక్రమ్, అనంతుల శ్రీధర్, జాయింట్ సెక్రటరీగా సురేష్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి, ప్రవీణ్, పెద్ది శ్రీరాములు, అనంతుల శ్రీధర్, గంగాధర్, శ్రీనివాస్ ఉన్నారు.

## విద్యార్థులకు రక్త పరీక్షలు



ప్రజాపక్షం/రాయికల్ : సులోచన హాస్పిటల్ జగిత్యాల వారి ఆధ్వర్యంలో డాక్టర్ శ్రీ ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి సూచన మేరకు శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భూపతిపూర్ లో 6వ తరగతి నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థినులు 105 మందికి రక్తహీనతకు సంబంధించిన రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ భావన మహేందర్ గౌడ్ ప్రారంబించారు.ఇట్టి పరీక్షలను ఆసుపత్రి సిబ్బంది మిట్టపల్లి, గణేష్, చెవులమద్ది గౌరీ, పడకంటి ప్రకాష్ మరియు నల్ల గణేష్ పరీక్షలు చేశారు.ఈ కార్యక్రమములోఇంచార్జి ప్రధానోపాధ్యాయులు బొల్లె చిన్నయ్య, ఉపాధ్యాయులు సత్యనారాయణ, సహబజ్ హుస్సేన్, సంజయ్ కుమార్, ఖమరుద్దీన్, వేణుగోపాల్, సురేష్ పుష్పలత, భవాని, శైలజ మరియు వంశీధర్ రావు, సాయబు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల అంగన్వాడి కేంద్రాల సందర్శన



ప్రజాపక్షం/మల్లాపూర్ : మండలంలోని సాతారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను అంగన్వాడి కేంద్రాలను గ్రామ సర్పంచ్ పోతవేణి నారాయణ గౌడ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. అలాగే అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణీలకు బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినోద్,ఉపసర్పంచ్ జగన్ ,వార్డు సభ్యులు జంగా ముత్తయ్య ,అచ్చ చిన్న రాజం,ఓల్లెపు పోచయ్య , ఉపాధ్యాయులున్నారు.

# అరాచక పాలనకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలి



ప్రజాపక్షం/పెద్దపల్లి : రామగుండంలో సాగుతున్న అరాచక పాలనకు ప్రజలు తమ ఓటు ద్వారా చరమగీతం పాడాలని మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం 8వ కాలనీ 14,17,19, వ డివిజన్లో టి.బి.జి.కె.ఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డితో కలసి మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మాక్కాన్ సింగ్ ఎన్నికల్లో పోటీ పడి గెలువలేక దొంగదారుల్లో బీ.ఆర్.ఎస్ అభ్యర్థులను భయ భ్రాంతులకు గురిచేసి పోలీసులతో కేసులు పెడుతామని బెదిరింపులకు చెస్తు విత్ డ్రాలు చేయుంచి గెలిచానని సంబరపడుతున్నడని ప్రజలు తమ ఓటు ద్వారా తగిన బుద్ధి చేప్పేందుకు సిద్దంగా ఉన్నరన్నారు. రామగుండంలో అభివృద్ధి పే రిట జరుగుతున్నది విధ్వంసం రాత్రిపూట దొంగలాగా మైసమ్మ దేవాలయాలు దుకాణాలు కూల్చడం ఇక్కడ నిత్య ం జరుగుతుందన్నారు. రామగుండం ఎమ్మెల్యే మాక్కాన్ సింగ్ నియంతలాగా వ్యవహరిస్తూ ఎన్నికల్లో గెలువలేక బిఆర్ఎస్ అభ్యర్థులను పోలీసులతో బెదిరింపులు చేస్తూ విత్ డ్రాలు చేయుంచారన్నారు చిరు వ్యాపారుల దుకాణాలను కూల్చి వారిని రోడ్డుపై పడేశాన్నారు. రాజీవ్ యువ కిరణాల పేరుతో నాలుగుసార్లు దరఖాస్తులు తీసుకుని, ఇప్పుడు వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు ఓట్లు అడిగేందుకు వస్తే వాళ్లను నీలదీయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్అభ్యర్థులు రవి నాయక్, వనిత, సదానందం, దాసరి భాగ్యలక్ష్మి, బాలరాజ్, నాయకులు శ్రీనివాస్, నారాయణ, దాసు, మారుతి, కుమార్, నాయక్ పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు డీట్ ద్వారా ఉపాధి అవకాశాలు

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి జిల్లాలోని మైనారిటీ నిరుద్యోగ యువత అందరూ తప్పనిసరిగా డీట్‌లో నమోదు చేసుకుని, ప్రభుత్వం ద్వారా కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖఅధికారి పి.నరేష్ కుమార్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం క్రియాశీల ఉపాధి వేదిక డిజిటల్ ఎంప్లాయ్ మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ(డీట్)ను ప్రవేశ పెట్టింది. ఇది ఒక మొబైల్ యాప్ వెబ్ యాప్, జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులు తమ ఫోన్ నుండి ఉద్యోగ సమాచారాన్ని నమోదు చేసుకోవడానికి, యాక్సెస్ చేయడానికి ఈ యాప్ ఉపయోగపడుతుందని, ఈ యాప్ ద్వారా నమోదు చేసుకోవడానికి అభ్యర్థి కనీస వయస్సు 15 సంవత్సరాలు ఉండాలి. ఎటువంటి విద్యా పరిమితి లేదు, ఏ విద్యా స్థాయికి చెందిన అభ్యర్థులు అయినా డీట్‌లో నమోదు చేసుకోవాలని, ఇంటర్న్ షిప్, అప్రెంటిస్ షిప్, పూర్తి సమయం, పార్ట్ టైం, ఇంటి నుండి పని వంటి ఉద్యోగాలు కూడా ఈ యాప్‌లో అందుబాటులో ఉంటాయని, కంపెనీ యజమానులు కూడా వారికీ కావలసిన ఉద్యోగాల వివరాలు నమోదు చేసుకోవచ్చు అని దీని ద్వారా ప్రైవేట్ రంగ సంస్థలు తమ ఖాళీ ఉద్యోగాలను డీట్ పోర్టల్లో నమోదు చేయడం ద్వారా అర్హత కలిగిన యువతకు తగిన ఉద్యోగ అవకాశాలు సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

మొబైల్ యాప్ ద్వారా నమోదు చేసుకోవడానికి: ప్లే స్టోర్ యాప్ స్టోరికి వెళ్లి డీట్ తెలంగాణ డౌన్లోడ్ చేసుకోండి > ఉద్యోగార్థుడిగా లేదా యజమానిగా సైన్ అప్ చేయండి లేదా వెబ్ ద్వారా నమోదు చేసుకోవడానికి https://deet.telangana.gov.in/ ఉద్యోగార్థిగా/ ఉద్యో గదాత)గా నమోదు చేసుకోవాలని ప్రభుత్వం ద్వారా కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ప్రకటనలో పేర్కొన్నారు.

# జాప్యం లేకుండా సిఎంపిఎఫ్ సేవలు




ప్రజాపక్షం/రామగిరి : అర్జీ 3 జి.ఎం కార్యాలయం నందు శుక్రవారం సంబంధిత అధికారులు, ఉద్యోగులతో 'ప్రయాస్' ఆరవ షెడ్యూల్ లో భాగంగా సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ముందుగా కమిషనర్లు ఎన్‌సిడబ్ల్యుఎ ఉద్యోగుల రివైజ్డ్ పెన్షన్ పేమెంట్ 69 పిపిఓ ఆర్డర్స్‌ను రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సిఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్ హరిపచౌరి మాట్లాడుతూ కాగితరహిత సేవలు అందించడమే లక్ష్యంగా సిఎంపిఎఫ్ లావాదేవీలు అన్ని సికేర్స్ పోర్టల్ ద్వారా మాత్రమే జరుగుతున్నాయన్నారు. ఉద్యోగులు ఎలాంటి మధ్యవర్తులు లేకుండా సిఎంపిఎఫ్ సేవలను పారదర్శకంగా పొందవచ్చని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సిఎంపిఎఫ్ క్లెయిమ్స్, రివైజ్డ్ పెన్షన్ తదితర అంశాలపై చర్చించారు. పెన్షన్ సీఎంపిఎఫ్ దరఖాస్తులు పెండింగ్ ఉండకుండా చర్యలు చేపట్టామన్నారు. జీరో పెండింగ్ స్థాయికి తీసుకువచ్చేందుకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలనీ అన్నారు. సింగరేణిలోనే కాకుండా, కోల్ ఇండియా స్థాయిలో రామగుండం 3 ఏరియా నందు కాంట్రాక్టు ఉద్యోగులకు సిఎంపిఎఫ్ లావాదేవీలు సికేర్స్ పోర్టల్‌లో అప్లోడింగ్ చేయుటలో మొదటి స్థానంలో ఉందని అందుకు సహకరించిన అధికారులకు, సిబ్బందిని అభినందిస్తూ కమిషనర్ జిఎంకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ నెల 28న ఉద్యగ విరమణ పొందనున్న సిఎంపిఎఫ్ కమిషనర్ హరిపచౌరి నీ రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, ఇతర అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, అధికారుల సంఘం, ఉద్యోగులు సన్మానించారు. ఉద్యోగ విరమణ అనంతరం వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలి ఆకాంక్షించారు. గనుల సంక్షేమ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విధులు బహిష్కరించిన న్యాయవాదులు



ప్రజాపక్షం/ధర్మపురి : చేవెళ్ల బార్ అసోసియేషన్ సభ్యురాలు, యువ మహిళా న్యాయవాది స్వప్నను దారుణంగా హత్య చేసిన ఘటనను ఖండిస్తూ శుక్రవారం ధర్మపురి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు విధులను బహిష్కరించి నిరదన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు అలుక వినోద్ కుమార్ మాట్లాడుతూ.. యువ న్యాయవాది స్వప్న హత్యకు కారకులైన వారిని వెంటనే ఫాస్ట్ ట్రాక్ కోర్టులో కేసు విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల రక్షణ చట్టం తేవాలని ఆరు ఏళ్లుగా న్యాయవాదులు చేస్తున్న పోరాటాన్ని ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మామిడాల శ్రీకాంత్, న్యాయవాదులు గడ్డం సత్యనారాయణ రెడ్డి, అప్పాల నిరంజన్, రౌతు రాజేష్, బందెల రమేష్, రామడుగు రాజేష్, కస్తూరి శరత్ కుమార్, గూడ జితేందర్ రెడ్డి, ఇంద్రకరణ్, ఊర్మిల, మనోహర్ పాల్గొన్నారు.

## పెట్రోలియం ఉత్పత్తులపై అవగాహన



ప్రజాపక్షం/రాయికల్ : పెట్రోలియం ఉత్పత్తుల సంరక్షణ, వినియోగంపై శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అల్లిపూర్ లో పాఠశాల విద్యార్థులకు సాక్ష్యం ఆధ్వర్యంలో అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పెట్రోలియం ఉత్పత్తులను అవసరం మేరకే వినియోగించుకోవాలని భవిష్యత్ తరాలకు వనరులను సంరక్షించి సుస్థిర అభివృద్ధికి పాటుపడాలని విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గుర్రం శ్రీనివాస్, బొమ్మగంటి రవికుమార్, రాజేందర్, వసంతరావు, జీవన్ రెడ్డి,రాజశేఖర్, రాజన్న,లక్ష్మి ,మహేష్, శంకరయ్య, ఆనంద్ బాలమురళి, రతిలాల్, మల్లారెడ్డి,రజిత మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## నాణ్యమైన భోజనం అందించాలి

ప్రజాపక్షం/మల్లాపూర్ : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ బి ఎస్ లత శుక్రవారం ఆకస్మికంగ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంటశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. అదేవిధంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని చేసి మెనూ ప్రకారం అందిస్తున్నారో లేదో విద్యార్థులని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సమస్యలు ఉంటే దృష్టికి తీసుకురావాలని పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. అంతకు ముందు తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు.వీరి వెంట తాసిల్దార్ శ్రీనివాస్, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు రాజేష్, రెవిన్యూ సిబ్బంది, కేజీబీవీ ప్రిన్సిపల్ శ్రీలత,సిబ్బంది తదితరులు ఉన్నారు.

## రాజీ పడే ప్రసక్తే లేదు

ప్రజాపక్షం/మల్లాపూర్ : మేజర్ గ్రామపంచాయతీలోని ప్రతి వార్డులో డ్రైనేజీలను ,వార్డులను పరిశుభ్రంగా ఉంచి శానిటేషన్ చేయడంలో రాజిపడే ప్రసక్తే లేదని సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ అన్నారు.ఈ సందర్భంగా శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సభను ఏర్పాటు చేసి గ్రామంలో ప్రధానంగా నెలకొన్న సమస్యలపై వార్డు సభ్యులు ప్రజాప్రతినిధులు సిబ్బందితో కలిసి చర్చించారు. ప్రతి వాడలో డ్రైనేజీలను శుభ్రం చేస్తూ వీధిదీపాలను అమర్చినట్లు ప్రజలకు సర్పంచ్ వివరించారు. ప్రతి సమస్యకు వెంటనే పరిష్కారం చూపుతామని గ్రామ ప్రజలంతా సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్,సిబ్బంది మనోహర్ రెడ్డి, ఉపసర్పంచ్ గడ్డం శ్రీనివాస్, అన్ని వార్డుల సభ్యులు అంగన్వాడి టీచర్లు తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, ఏఎన్ఎం,ఆశ కార్యకర్తలు,తదితరులు ఉన్నారు.

## అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలి

### సహాయ కార్మిక అధికారి కే. హేమలత

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013 ప్రకారం అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలని సహాయ కార్మిక అధికారి కే.హేమలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని ప్రైవేటు, సంఘటిత అసంఘటిత రంగాలల్లో పని చేస్తున్నటువంటి మహిళలపై పని ప్రదేశాలల్లో లైంగిక వేదింపుల నివారణ కొరకు 10 మంది, అంతకు మించి పని చేస్తున్న అన్ని వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థలు, దుకాణ సముదాయాల లో చట్ట ప్రకారం అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలని, పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013 ప్రకారం, కమిటీ ఏర్పాటు చేసి అట్టి కమిటీ సభ్యుల పేర్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెబ్ పోర్టల్ http://shebox. tgwdcw.in నందు నమోదు చేయవలెను, లేనియెడల సంబంధిత సంస్థ యాజమాన్యానికి చట్ట ప్రకారం జరిమానా విధించడం జరుగుతుందని సహాయ కార్మిక అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## జన్నారంలో అరుదైన స్నేక్ బర్డ్

### ఎఫ్‌డిఒ రామ్మోహన్



**ప్రజాపక్షం/జన్నారం :** జన్నారం అటవీ ప్రాంతంలో అరుదైన స్నేక్ బర్డ్ (ఓరియంటల్ డార్టర్) సంచరిస్తున్నట్లు అటవీ డివిజనల్ అధికారి రామ్మోహన్ తెలిపారు. సాధారణంగా ఉష్ణమండల దక్షిణ ఆసియా, ఆగ్నేయాసియా ప్రాంతాల్లోని చిత్తడి నేలల్లో నివసించే ఈ పక్షి ఇక్కడ కనిపించడం విశేషమని పేర్కొన్నారు. ఈ పక్షికి తల పాములా ఉండటంతో పాటు రెక్కలు డేగను పోలి ఉండటంతో దీనిని ఓరియంటల్ డార్టర్ అని కూడా పిలుస్తారని వివరించారు. చేపలను వేటాడే సమయంలో ఈ పక్షి నీటిలో పూర్తిగా మునిగి పాములా మెడను మాత్రమే బయటకు చూపిస్తూ సంచరిస్తుందని వెల్లడించారు. వేట అనంతరం రెక్కలు తడవడంతో అవి ఎండలో విప్పి ఆరబెట్టుకునే ప్రత్యేక స్వభావం ఈ పక్షికి ఉంటుందని తెలిపారు. జన్నారం అటవీ ప్రాంతంలో ఇటువంటి అరుదైన పక్షుల సంచారం ప్రకృతి సంపదకు నిదర్శనమని ఎఫ్‌డిఓ రామ్మోహన్ కొనియాడారు.

## జన్నారం ఐటిఐలో అప్రెంటిస్ మేళా

### ప్రిన్సిపల్ బండి రాములు

**ప్రజాపక్షం/జన్నారం :** ప్రభుత్వ ఐటిఐ జన్నారంలో ఈ నెల 9వ తేదీ సోమవారం నాడు ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్ మే ళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ బండి రాములు తెలిపారు. తెలంగాణ ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈ మేళాలో సర్వో డ్రైన్, జాన్ డియర్, ఆదర్శ మోటార్స్ వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేస్తాయని వివరించారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలను తీసుకురావాలని సూచించారు.

## పార్డిలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**ప్రజాపక్షం/కౌటాల :** కౌటాల మండలం పార్డి గ్రామంలో నిర్వహిస్తున్న నాలుగు గ్రామాల క్రికెట్ టోర్నమెంట్‌ను గ్రామ సర్పంచ్ మడావి చందు, ఎస్ఐ చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ఆన్‌లైన్ గేమ్‌లకు దూరంగా ఉండి ఇటువంటి క్రీడా పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. క్రీడల వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి టోర్నమెంట్లు దోహదపడతాయని తెలిపారు.సర్పంచ్‌లు సత్తయ్య,బిఆర్ఎస్ నాయకులు మోతిరాం, సత్యన్న పాల్గొన్నారు.



## అంగన్వాడీ కేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/తిర్యాణి :** మండలంలోని గుండాల గ్రామ పంచాయతీ పరిధిలోని పున్నగూడ, రాజగూడ ప్రాంతాల్లో నూతనంగా ఏర్పాటు చేయనున్న అంగన్వాడీ కేంద్రాల నిర్మాణ పనులకు సర్పంచ్ ఆడ సోము భూమి పూజ చేశారు. నిర్ణీత స్థలాల్లో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని, ముఖ్యంగా మహిళలు, చిన్నారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పోషకాహారం, ప్రాథమిక విద్యతో పాటు గర్భిణులు, బాలింతలకు అవసరమైన సేవలు అందుతాయని పేర్కొన్నారు. పున్నగూడ, రాజగూడ ప్రాంత ప్రజలకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగకరంగా మారుతుందని అన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని సర్పంచ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అభ్యర్థులు ఎన్నికల ఖర్చులను స్పష్టంగా నమోదు చేయాలి

### మున్సిపల్ ఎన్నికల పరిశీలకులు దేవేందర్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చుల వివరాలను నిబంధనల ప్రకారం స్పష్టంగా నమోదు చేయాలని మున్సిపల్ ఎన్నికల పరిశీలకులు దేవేందర్ సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవనంలో అభ్యర్థులతో వ్యయ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు సభలు, ర్యాలీల, సమావేశాలు కోసం ముందస్తుగా అనుమతి పొందాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి ఖర్చుల వివరాలను నిర్దిష్ట కాలపరిమితిలో అధికారులకు సమర్పించాలని పేర్కొన్నారు. ఖర్చుల కోసం ప్రత్యేక బ్యాంకు ఖాతా నిర్వహించాలని, రికార్డులను పక్కాగా భద్రపరచాలని అభ్యర్థులకు అవగాహన కల్పించారు. నిర్ణీత వ్యయ పరిమితిని మించి ఖర్చు చేసినా లేదా నిబంధనలు ఉల్లంఘించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరిగేందుకు అభ్యర్థులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల వ్యయ నోడల్ అధికారి నదీమ్ ఖుద్దుసి, ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ గజానన్, మాస్టర్ ట్రైనర్ ఊసన్న, ఎన్నికల విభాగం అధికారులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

## కుట్టుమిషన్ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

### కలెక్టర్ కె. హరిత



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ కె. హరిత పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో గల మండల సమాఖ్య భవనంలో గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆసిఫాబాద్, జైనూర్, సిర్పూర్, కాగజ్‌నగర్, వాంకిడి ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల కోసం 24,765 జతల ఏకరూప దుస్తులను ఈ కేంద్రం ద్వారా కుట్టి అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన దుస్తులను నిర్ణీత గడువులోగా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. శిక్షణ కేంద్రంలోని సౌకర్యాలపై గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. మహిళల సాధికారతకు ఇలాంటి శిక్షణా ఎంతో దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి దత్తారావు, సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## తపాలపూర్ గ్రామంలో అర్ధరాత్రి దోపిడీ

### ఎస్ఐ గొల్లపల్లి అనుష

**ప్రజాపక్షం/జన్నారం :** జన్నారం మండలం తపాలపూర్ గ్రామంలో అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి మహిళ కళ్లలో కారం కొట్టి బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన ఘటన చోటుచేసుకుంది. బాధితురాలు రామటెంకి లావణ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 5వ తేదీ రాత్రి లావణ్య తన భర్త రాజన్న, కూతురు ఆరాధ్యతో కలిసి ఇంట్లో నిద్రపోయారు. తెల్లవారుజామున 3 నుంచి 4 గంటల మధ్య సమయంలో ఇంటి ముందు శబ్దం రావడంతో లావణ్య తలుపు తీసింది. అప్పటికే ముఖానికి మాస్క్ ధరించి ఉన్న దుండగుడు తన వెంట తెచ్చుకున్న కారం పొడిని లావణ్య కళ్లలో చల్లాడు. ఆమెను చేతులతో కొట్టి మెడలో ఉన్న రెండు తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని పరారయ్యాడు. పక్షవాతంతో బాధపడుతున్న ఆమె భర్త రాజన్న మంచం మీద ఉండగానే ఈ దోపిడీ జరిగింది. ఈ ఘటనపై ఎస్ఐ గొల్లపల్లి అనుష కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నారు.

## రాపల్లిలో ముమ్మరంగా డ్రైనేజీ పనులు

**ప్రజాపక్షం/హాజీపూర్ :** మండలంలోని రాపల్లి గ్రామంలో ప్రజారోగ్యం, పారిశుధ్యాన్ని మెరుగుపరిచే దిశగా డ్రైనేజీ శుభ్రత పనులను సర్పంచ్ మిట్టపల్లి రాంరెడ్డి చేపట్టారు. శుక్రవారం గ్రామంలోని డ్రైనేజీల్లో పేరుకుపోయిన మట్టి, మురుగు నీటి అవరోధాలను సిబ్బందితో తొలగింపజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ డ్రైనేజీల నిర్వహణ సరిగ్గా లేకపోవడం వల్ల మురుగు నీరు నిలిచిపోయి దోమల వ్యాప్తి, దుర్వాసన వస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన జీవన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఈ పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ కార్యదర్శి సాయిరాం ఈ పనులను స్వయంగా పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా డ్రైనేజీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ముందస్తుగా ఈ చర్యలు తీసుకోవడం వల్ల సీజనల్ వ్యాధుల ముప్పు తప్పుతుందని సర్పంచ్ ధీమా వ్యక్తం చేశారు.

## సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** మండలంలోని మల్లూరు గ్రామానికి చెందిన పలువురు లబ్దిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఒంటరి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం అందజేశారు.పలు అనారోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చికిత్స పొందిన వారు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోవడంతో ఒకరికి రూ 60 వేలు, మరొకరికి రూ 14 వేల రూపాయల విలువ చేసే చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఒంటరి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గొల్ల హన్మండ్లు, కాంగ్రెస్ నాయకులు బుడిమె మైశయ్య, బుడ్మి శ్రీనివాస్, చాకలి ఎల్లయ్య, వార్డు సభ్యుడు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## పంటసాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలి

**ప్రజాపక్షం/పిట్లం:** రైతులు పంట సాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలని పిట్లం మండల వ్యవసాయశాఖ అధికారి వినోద్ సూచించారు. ఆయన శుక్రవారం పిట్లం గ్రామ రైతులు సాగు చేస్తున్న జొన్న పంటలు పరిశీలించారు. జొన్నను ఆశించే చీడపీడల నివారణకు వ్యవసాయశాఖ సలహాలు, సూచనల మేరకు పురుగుమందులు వాడుకోవాలని ఆయన రైతులకు సూచించారు. ముఖ్యంగా జొన్నలో మొగి పురుగు నివారణకు అమామెక్టిన్ బెన్జోవేట్ పిచికారి చేసుకోవాలని కోరారు. వారి వెంట గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

## ముకుంద్‌రెడ్డి కాలనీలో సిసి కెమెరాల ఏర్పాటు

**ప్రజాపక్షం/పిట్లం:** పిట్లం మండలకేంద్రంలోని ముకుంద్‌రెడ్డి కాలనీలో 7 సీసీ ఎమెరాలు ఏర్పాటు చేయబడినవని బాన్సువాడ రూరల్ సీఐ తిరుపయ్య పేర్కొన్నారు. గ్రామంలో కాలనీవాసులు, గ్రామపంచాయతీ తరపుణ కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోగా వీటిలో 3 కెమెరాలు రోడ్డు మార్గంలో, కాలనీ పరిసరాల లో ప్రవేశ/నిష్క్రమణ మార్గాలలో ఈ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం మండలంలోని గోద్మేగావ్ గ్రామంలో నిర్వహించిన సీసీ కెమెరాలపై అవగాహన కార్యక్రమంలో ప్రజలకు సీసీ కెమెరాల ఏర్పాటు, సైబర్ నేరాలు తదితర అంశాలను గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిట్లం ఎస్సై వెంకట్‌రావు, గ్రామపెద్దలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి 3 రోజుల జైలు శిక్ష

**ప్రజాపక్షం/పిట్లం:** పిట్లం పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ లో మద్యం సేవించి వాహనాలు నడిపిన ఒకరికి 3 రోజుల జైలు శిక్ష విధించడం జరిగిందని ఎస్సై టి.వెంకట్‌రావు తెలిపారు. పిట్లం గ్రామానికి చెందిన మ ఆటంకాడి సాయిలుకు రూ 1000 జరిమానతో పాటు 3 రోజులు జైలు శిక్షను బాన్సువాడ సెకండ్ క్లాస్ న్యాయమూర్తి టి.గోపాల్‌రావు విధించినట్లు ఎస్సై తెలియజేశారు. ఎంతటి వారైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదని ఎస్సై హెచ్చరించారు.

## టెండల్ పోస్టులకు ప్రాక్టికల్ పరీక్షలు

### ఎస్ఓ టు జిఎం జిఎల్ ప్రసాద్

**ప్రజాపక్షం/మందమర్రి :** మందమర్రి ఏరియా వర్క్‌షాప్‌లో టెండల్ అండర్ గ్రౌండ్, సర్ఫేస్ కేటగిరి 04 పోస్టులకు సంబంధించి ప్రాక్టికల్ పరీక్షలను కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ పరీక్షలకు ఎస్ఓ టు జిఎం జిఎల్ ప్రసాద్, ఏరియా ఇంజనీర్ బాలాజీ భగవతి జె, డిజిఎం పర్సనల్ అశోక్, డిజిఎం ఐఇడి కిరణ్ కుమార్ కమిటీ సభ్యులుగా హాజరై పర్యవేక్షించారు. అండర్ గ్రౌండ్ టెండల్ కేటగిరి 04లోని 7 ఖాళీలకు నలుగురు, సర్ఫేస్ టెండల్ కేటగిరి 04లోని 2 ఖాళీలకు ముగ్గురు అభ్యర్థులు హాజరయ్యారు. ప్రాక్టికల్ పరీక్షలను పూర్తిస్థాయి పారదర్శకతతో, నిబంధనల ప్రకారం నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అభ్యర్థుల అర్హత, పనితీరు ఆధారంగానే ఎంపిక ప్రక్రియ ఉంటుందని స్పష్టం చేశారు.



## శివాజీ విగ్రహ స్థాపనకు విరాళం




**ప్రజాపక్షం/జన్నారం :** జన్నారం మండలం చర్లపల్లె గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ స్థాపన కోసం శ్రీ మల్లికార్జున యాదవ సంఘం ఆర్థిక సాయం అందించింది. విగ్రహ ఏర్పాటుకు తమ వంతు సహకారంగా 5,516 రూపాయల విరాళాన్ని సంఘం ప్రతినిధులు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ ఆశయాలను స్మరించుకుంటూ గ్రామంలో విగ్రహాన్ని ప్రతిష్టించడం అభినందనీయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షులు గొర్రె మహేష్, ఉపాధ్యక్షులు మేకల రమేష్, పాలకాల వెంకటేష్, మేకల రాజన్న, గొట్ల శ్రీదర్, పాలకాల మహిపాల్, గొర్రె శేఖర్, గొర్రె మధుకర్, మేకల సతన్న, జంగం దుబ్బయ్య, మేకల సురేష్, రెంకల సతన్న పాల్గొన్నారు.

## కిష్టాపూర్ అంగన్వాడీ కేంద్రం తనిఖీ



**ప్రజాపక్షం/జన్నారం :** జన్నారం మండలం కిష్టాపూర్ గ్రామ అంగన్వాడీ కేంద్రాన్ని సర్పంచ్ వాసాల నరేష్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, నిర్వహణ తీరు, రికార్డులను ఆయన పరిశీలించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, విద్యకు సంబంధించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిల్లలతో మమేకమై వారి చదువు, ఆహారపు అలవాట్లపై ముచ్చటించి వారిని ప్రోత్సహించారు. నిరంతరం పర్యవేక్షణ ఉండటం వల్ల కేంద్రాల పనితీరు మెరుగుపడుతుందని తెలిపారు. ఉపసర్పంచ్ కోలపాల, వార్డు సభ్యులు ముం జంపల్లి సాయి, నల్ల తిరుపతి, అంగన్వాడీ సిబ్బంది స్వరూప, అనిత పాల్గొన్నారు.

## బిజెపి తోనే బైంసా పట్టణ అభివృద్ధి..

### ఎన్నికల ప్రచారం లో ఎమ్మెల్యే ..

**ప్రజాపక్షం/బైంసా :** బిజెపి తోనే బైంసా పట్టణ అభిబుద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు.మున్సిపల్ ఎన్నికల ప్రచారం లో భాగంగా 8,10 వార్డుల్లో ప్రచార పర్వం చేపట్టిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి కోసం 28 కోట్ల రూపాయల నిధులు కేంద్ర ప్రభుత్వం మంజూరు అయ్యాయాని,మరో 2 కోట్ల తో చెరువు కట్ట మహాదేవ్ మందిరర్ ను అభివృద్ధి చేస్తామన్నారు.18 కోట్ల రూపాయల నిధులతో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు.త్వరలో పనులు ప్రారంభం అవుతాయన్నారు.బిజెపి అభ్యర్థులు సుభాష్,అమోల్ ను గెలిపించాల్సిందిగా కోరారు.

## మున్సిపాలిటీల అభివృద్ధికి కేంద్ర నిధులే అధికం..



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ మున్సిపలిటీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులు 12మంది గెలువడం ఖాయమని,మున్సిపాలిటీపై బీజేపీ జెండా ఎగరవేస్తామని ఎంపీ గోడం నగేష్ అన్నారు.శుక్రవారం ఖానాపూర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్ తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఖానాపూర్ పట్టణంలోని విద్యానగర్,శ్రీరామ్‌నగర్,అంబేద్కర్ నగర్,శాంతినగర్,పద్మావతి నగర్,కాలనీల్లో ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖానాపూర్ పట్టణ అభివృద్ధికి బీజేపీ పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు.ఖానాపూర్ లో నిలిపివేసిన ఉపాధి హామీ పథకం మళ్ళీ కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాబోయే కొద్ది రోజుల్లో జీ రాంజీ పథకం తీసుకువస్తామని పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వ నిధులతో ఖానాపూర్ ను అభివృద్ధి పథంలో నడిపిస్తామని,మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల ఇంచార్జ్ వాకాడి పుల్లారావు యాదవ్,రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్,జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి,పట్టణ అధ్యక్షుడు కీర్తి మనోజ్,మండల అధ్యక్షుడు పుప్పాల ఉపేందర్,సర్పంచ్‌లు బక్కశెట్టి వెంకటరములు,పెట్టం చంద్రశేఖర్,చేగంటి మల్లేష్,బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సొంతింటి కల సాకారం..



**ప్రజాపక్షం/ముధోల్ :** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే నిరుపేదల సొంతింటి కల సాకారమవుతుందని అష్టా గ్రామ సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్ అన్నారు.శుక్రవారం మండలంలోని అష్టా గ్రామంలో సర్పంచ్ అధ్యక్షతన నూతన ఇళ్లకు శ్రీకారం చుట్టారు.గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో లబ్ధిదారులైన దుడ్డు షామాల,గైని దేవుబాయి,వాసరి చిన్నన్న గృహ నిర్మాణాలకు సర్పంచ్ స్వయంగా పునాది రాయి వేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ,ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం పేద కుటుంబాలకు ఒక గొప్ప వరమని తెలిపారు.అర్హులైన ప్రతి లబ్ధిదారుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ త్వరితగతిన ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకోవవాలని సూచించారు.గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని,ప్రభుత్వ పథకాలు గ్రామానికి పూర్తిగా అందేలా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సురుగుల సావిత్ర కోటయ్య,పంచాయతీ కార్యదర్శి గంగాధర్,కారోబారి భోజన్న,మల్లేష్,భోజన్న,కిలాజి మోహన్ తదితరులు,గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ముధోల్‌లో ఉపాధి హామీ నర్సరీ పనుల ప్రారంభం..



**ప్రజాపక్షం/ముధోల్ :** ముధోల్ మండల కేంద్రమైన ముధోల్ లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన వివిధ అభివృద్ధి పనులతో పాటు,నర్సరీ పనులను సర్పంచ్ షబానాన ఎజాజ్ ఉద్దీన్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.గ్రామీణ ఉపాధి అవకాశాలు పెంపొందించడం,పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామాభివృద్ధి లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు చెప్పారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో అర్హులైన వారికి పని కల్పించడంతో పాటు గ్రామానికి అవరసమైన అభివృద్ధి పనులను దశల వారీగా చేపడుతామని పేర్కొన్నారు.అలాగే గ్రామంలో అవసరమైన మొక్కలను స్థానికంగానే పెంచే ఉద్దేశంతో సర్సరీ ఏర్పాటు చేయడం వల్ల హరితాభివృద్ధికి బలమైన పునాది పడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోరి లావణ్య సాయినాథ్,ఈఓ అన్వర్ అలీ,వార్డ్ సభ్యులు విశ్వంబర్,టిపి యోగేష్,గ్రామ పెద్దలు,కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## 12న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి..




**ప్రజాపక్షం/బైంసా :** కార్మిక సమస్యల పరిష్కారం కై ఈ నెల 12న జరిగే దేశావ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలనీ తెలంగాన ప్రగతిశీల బీడి వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియూ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.హరిత పిలుపునిచ్చారు.శుక్రవారం బైంసా,కిష్టాపూర్ శివాజీ సెంటర్ లలో సమ్మె పోస్టర్స్ విడుదల చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవవ్యాప్తంగా కార్పొరేట్లకు,దేశ సంపదను కార్మికవర్గ శ్రమను కారు చౌకగా కేంద్ర మోడీ ప్రభుత్వం దోచిపెడుతున్నదని,బీడీ పరిశ్రమ నావనానికి జిఎస్‌టి విధిస్తున్నదని విమర్శించారు.బీడీ కార్మికుల ను నష్టం చేసే చట్టాన్ని రద్దు చేయాలనీ,కనీస పెన్షన్ 9 వేలు ఇవ్వాలని,బీడీ పరిశ్రమలో పనిచేసే కార్మికులందరికి షరతుల్లేని జీవన భృతి అమలు చేయాలని,కనీస పెన్షన్ 9 వేలు ఇవ్వాలని,కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో కార్మికులు లక్ష్మి,బేబీ,మీనా,విజయ,గంగాధర్,రాములు,భారతి,,రుక్మ తదితరులు పాల్గొన్నారు.

## పదన తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన..

**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండలం లోని కౌట బి.గ్రామం లోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల లో స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు మోటివేషనల్,కెరీర్ గైడెన్స్ కార్యక్రమంను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ మోటివేషనల్,కెరీర్ గైడెన్స్ నిపుణులు అల్లం సాయి కృష్ణ,రమణ గౌడ్,గొడిసెల లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికావద్దని,ప్రణాళిక బద్దంగా చదివితే మంచి మార్కులు వస్తాయని తెలిపారు.ప్రతి సబ్జెక్ట్ ను బట్టి పట్టకుండా క్షుణ్ణంగా అర్థం చేసుకుంటూ చదవాలని సూచించారు.తల్లిదండ్రులు కష్టాన్ని అర్థం చేసుకుంటూ అత్యధిక మార్కులు సాధించి వారిని గర్వ పడేలా చేయాలని కోరారు.చదువుతున్న సమయంలో పాటించాల్సిన సుత్రాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.అనంతరం విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి పరిచారు.

## ఎన్నికల వ్యయ వివరాలు కచ్చితంగా నమోదు చేయాలి




**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ఖర్చులను ఎన్నికల నియమావళి ప్రకారం తప్పనిసరిగా నమోదు చేయాలని మున్సిపల్ కమిషనర్ బి. తిరుపతి, ఎన్నికల పరిశీలకుడు ఎ. దేవేంద్ర సూచించారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలో ఎన్నికల వ్యయ నిర్వహణపై పోటీ అభ్యర్థులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అభ్యర్థులు ఖర్చుల వివరాలను నిర్దిష్ట కాలపరిమితిలో అధికారులకు సమర్పించాలన్నారు. ఎన్నికల ఖర్చుల పరిమితులు, ప్రత్యేక బ్యాంకు ఖాతా నిర్వహణ, ఖర్చులకు సంబంధించిన రికార్డుల సంరక్షణ వంటి అంశాలపై అభ్యర్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## స్కూల్ బస్సులకు అద్దాల్లేవు.. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం

**ప్రజాపక్షం/రెబ్బెన :** పాఠశాల బస్సుల నిర్వహణలో ప్రైవేట్ యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయి. మంచిర్యాల జిల్లా తాండూరు మండలంలోని సెయింట్ థెరిస్సా స్కూల్‌కు చెందిన బస్సు అద్దం పగిలిపోయినా యాజమాన్యం పట్టించుకోవడం లేదు. ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలోని గోలేటి గ్రామానికి వచ్చే ఈ బస్సు వెనుక అద్దానికి బదులుగా గ్రీన్ మ్యాట్ కప్పి నడుపుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా, కనీస భద్రత లేకుండా నడుపుతున్న ఈ బస్సుల పట్ల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫీజుల వసూలుపై చూపే శ్రద్ధ విద్యార్థుల భద్రతపై చూపడం లేదని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఉదయం వేళ చలి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ బస్సు వెనుక అద్దం లేకపోవడంతో చల్లని గాలి నేరుగా లోపలికి వస్తోందని, దీనివల్ల పిల్లలు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల బస్సుల ఫిట్‌నెస్‌ను తనిఖీ చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే స్కూల్ యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

**ప్రజాపక్షం/హాజీపూర్ :** వినియోగదారుల సమస్యలను పరిష్కరించి, నాణ్యమైన విద్యుత్ అందించడమే విద్యుత్ శాఖ లక్ష్యమని వినియోగదారుల ఫోరం చైర్మన్ ఎరుకల నారాయణ అన్నారు. శుక్రవారం హాజీపూర్ సబ్ స్టేషన్‌లో నిర్వహించిన విద్యుత్ సమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందిన ఐదు అర్జీలలో రెండింటిని వెంటనే పరిష్కరించామని, మిగిలిన సమస్యలను త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. వినియోగదారులు బిల్లులను కేవలం ఆన్‌లైన్ ద్వారానే చెల్లించాలని, సిబ్బందికి నేరుగా నగదు ఇవ్వవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు రామకృష్ణ, సత్యనారాయణ, రాజాగౌడ్, ఎస్‌ఈ రాజన్న, డిఇ ఖైజార్, ఎడిఎ రాజశేఖర్, ఎఇలు మహేందర్ రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## గ్రామాల్లో ఉచిత చేప పిల్లల పంపిణీ

**ప్రజాపక్షం/కోటపల్లి :** కోటపల్లి మండలంలోని కొండంపేట, ఎడగట్ట గ్రామాల్లో ఐసిఎఆర్, సిఆర్ఐడిఎ సంస్థల ఆధ్వర్యంలో ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేశారు. ఎస్సి సబ్ ప్లాన్ లో భాగంగా హైదరాబాద్‌కు చెందిన ఈ సంస్థల ప్రతినిధులు శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ డాక్టర్ టి.వి. ప్రసాద్ మాట్లాడుతూ ఎస్సి ఉప ప్రణాళిక ద్వారా మత్స్యకారులను, రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. చేపల పెంపకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. రైతులు ఆధునిక పద్ధతులు పాటించి ఆర్థికంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఇలాంటి ఉచిత పంపిణీ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నర్సింహులు, అభిషేక్, పవన్, మండల కోఆర్డినేటర్లు సునీల్, సంపత్, గ్రామ సర్పంచ్ వెంకటమ్మ బాపు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# భీమ్‌గల్ అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంది

**మంజూరైన 10 కోట్ల పనులను రెండేళ్లుగా ఎందుకు నిలిపివేశారు ?**

**మహిళలను నెలకు రూ.2500 ఏవి ? తులం బంగారం ఏది ? మోసపూరిత హామీలిచ్చిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి ?**

**రేవంత్ సర్కార్‌ను నిలదీసిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి**

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** భీమ్‌గల్ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా 4, 8, 2 వార్డులలో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్ బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నేను మంత్రిగా ఉన్నప్పుడు 2023 ఆగస్టులో భీమ్‌గల్ అభివృద్ధి కోసం 10 కోట్ల మంజూరు చేశాను, అక్టోబర్ 2023 లో కలెక్టర్ ద్వారా వర్క్ ఆర్డర్స్ కూడా వచ్చాయి. ముఖ్యంగా వార్డు మెంబర్లు 4, 5, 6, 9, 12లో సీసీ రోడ్లు, డ్రైనేజీల కోసం 2 కోట్లు కేటాయించాము. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక, ఆ మంజూరైన పనులను కక్ష్యపూరిత ంగా రెండేళ్లుగా ఆపివేసింది పనులు మొదలుపెట్టకుండా ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. నిజామాబాద్, ఆర్మూర్ వెళ్లకుండా భీమ్‌గల్‌లోనే వైద్యమందించాలని 40 కోట్లతో 100 పడకల ఆస్పత్రిని మంజూరు చేసి 80 శాతం పనులు పూర్తి చేశాం. రెండేళ్లుగా మిగిలిన పనులు చేయకుండా ఆస్పత్రిని ప్రారంభించడం లేదు. అలాగే 6 కోట్లతో మొదలు పెట్టిన మార్కెట్ పనులను భీమ్‌గల్ బస్సు డిపోను కూడా ప్రభుత్వం గాలికి వదిలేసింది. డిపోలో బస్సులు లేవు, కంట్రోలర్లు లేరు. సిఎం రేవంత్‌రెడ్డిపై వేముల ప్రశాంత్‌రెడ్డి నిప్పులు చెరిగారు. ఎన్నికలప్పుడు నెలకు రూ.2500 ఇస్తామని మహిళలను నమ్మించారు. ఇప్పుడు 25 నెలలైంది ఒక్క రూపాయి రాలేదు. అంటే ఒక్కో మహిళకు కాంగ్రెస్ ప్రభుత్వంరూ.62500 లు బాకీ పడ్డట్టే కదా ? అవ్వాతాతలకు 4 వేల పింఛన్ ఇస్తామన్నారు. ఇచ్చారా ? తులం బంగారం ఇస్తామన్నారు, ఇచ్చారా ? రైతు రుణమాఫీ అందరికి కాలేదు. రైతుబంధు 15 వేలు ఇస్తామని చెప్పి పాత 10 వేలు కూడా సరిగ్గా ఇవ్వటం లేదన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి నమ్మి ఓట్లు వేస్తే మోసం చేశారని కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలిసేలా ఈ ఎన్నికల్లో తీర్పు ఉండాలని, ఈ మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపిస్తేనే రేపు ప్రభుత్వానికి భయం పెట్టి మీకిచ్చిన హామీలను



అమలు చేస్తారని గత కేసీఆర్ ప్రభుత్వంలో నేను చేసిన అభివృద్ధి పనులను చూసి భీమ్‌గల్ భవిష్యత్తు కోసం కారు గుర్తుపై ఓటేసి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు లక్ష్మీ భగత్, పద్మ దశరథ్, పర్స నవీన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నాను.ఈ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి ఓటును వృధా చేసుకోవద్దన్నారు. రాష్ట్రం నుండి కేంద్రానికి అత్యధిక పన్నులు కడుతుంటే కేంద్రం మాత్రం రాష్ట్రానికి నిధులు కేటాయించడం లేదన్నారు. రాష్ట్రం నుండి 8 మంది కాంగ్రెస్, 8 మంది బీజేపీ ఎంపీలు ఉండి రాష్ట్రానికి ఒరిగింది శూన్యమన్నారు. తాను అధికారంలో లేకపోయినా ప్రజల పక్షాన నిలబడుతానని భీమ్‌గల్ అభివృద్ధి కోసం నిరంతరం పోరాడుతానని ప్రశాంత్‌రెడ్డి హామీనిచ్చారు.

## గాజుల సౌమ్యకు జోహార్లు

**ప్రజాపక్షం / నందిపేట్ :** కానిస్టేబుల్ పని చేసి కొందరి దాడి వల్ల ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వీర మరణం పొందిన గాజుల సౌమ్యకు శుక్రవారం నందిపేట్ మండల పద్మశాలీలు నివాళులు అర్పించారు. మరణానికి కారణమైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇంట్లో మరొకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సౌమ్య అమర్ హై అంటు నినాదాలు చేశారు.

## నిజాం షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల ముందస్తు అరెస్టు

**ప్రజాపక్షం/బోధన్:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజామాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా బోధన్ పట్టణం నిజాంసాగర్ ష్యాక్టరీ కార్మికులను ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకుంటారన్న ఉద్దేశ్యంతో పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ కార్మికులు మాట్లాడుతూ.. పది సంవత్సరాలుగా రావాల్సిన వేతన బకాయిలు కార్మికులకు ఇప్పించి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత నిజాం షుగర్ ఫ్యాక్టరీని రెండు నెలలో తెరిపిస్తామని కార్మికుల వేతనాలు ఇప్పిస్తామని చెప్పి నేటికి అమలు చేయలేదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించి ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు ఉపేందర్, రవి శంకర్ గౌడ్, కున్నారా స్వామి, శ్రీనివాస్, రాజారాం పాల్గొన్నారు.




## సబ్ కలెక్టర్‌ను ఆహ్వానించిన శ్రీ చక్రేశ్వర ఆలయ ఈఓ

**ప్రజాపక్షం/బోధన్:** మహాశివ రాత్రిని పురస్కరించుకొని ఈ నెల 15న బోధన్ పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివాలయంలో నిర్వహించే మహాశివరాత్రి జాతర ఉత్సవాలకు ఆలయ ఈఓ రాములు, బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం సబ్ కలెక్టర్ వికాస్ మహాతో ను కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఉత్సవ ఆహ్వాన పత్రిక అందించి జాతర ఉత్సవానికి ఆహ్వానించారు. మహాశివ రాత్రి జాతర ఉత్సవానికి సలహాలు సూచనలు ఇవ్వాని కోరారు. అనంతరం బోధన్ పట్టణ ఎస్‌హెచ్‌ఓ వెంకట్ నారాయణ ను కలిసి జాతర ఉత్సవానికి ఆహ్వానించారు. ఉత్సవాలలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారికి ఈఓ రాములు స్వామి



వారి శేష వస్త్రంతో సన్మానించి ప్రసాదం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు గణేష్ శర్మ, మహేష్ పాటక్ పాల్గొన్నారు.

## అభ్యర్థులకు మద్దతుగా మాజీ జడ్పీ చైర్మన్ ఎన్నికల ప్రచారం

**ప్రజాపక్షం/బోధన్:** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్ లో బిఆర్‌ఎస్ పార్టీ 3వ వార్డు అభ్యర్థి ఫాతిమా బేగం, కాజా ఫయోద్దీన్‌కు మద్దతుగా శుక్రవారం నిజామాబాద్ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బిఆర్‌ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థుల గుర్తు కారు గుర్తుకు ఓటు వేసి భారీ మేజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిఆర్‌ఎస్ పాలనలోనే కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందిందని అన్నారు. బోధన్ పట్టణ అభివృద్ధి కొరకు మాజీ ఎమ్మెల్యే షకీల్ అమీర్ ఎంతగానో కృషి చేశారని అన్నారు. బోధన్ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజల కష్టాలు తీర్చిన నాయకుడు మాజీ ఎమ్మెల్యే



షకీల్ అని కొనియాడారు. ఈ నెల 11న జరిగే మున్సిపల్ ఎన్నికలలో బిఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ఓటర్లు నిలవాలని కారు గుర్తుకు ఓటు వేసి భారీ మేజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు నరసింగరావు, శ్రీనివాస రావు, ఫయాసుద్దీన్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ నిధులతోనే పట్టణాల అభివృద్ధి

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎంపీఆర్**

**ప్రజాపక్షం/బోధన్:** కేంద్ర ప్రభుత్వ నిధులతోనే తెలంగాణ రాష్ట్ర పట్టణాల అభివృద్ధి చెందుతుందని కేంద్ర ప్రభుత్వం నిధులు 18కోట్ల రూపాయాలతో బోధన్ పట్టణం అభివృద్ధి చెందుతుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి అన్నారు. బోధన్ పట్టణ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 15,16,04వ వార్డులలో భాజపా పార్టీ అభ్యర్థులకు మద్దతుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, వడ్డీ మోహన్ రెడ్డిలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని శక్కర్ నగర్ ధోబిగల్లీ నాల్గవ వార్డు లో గల బంగారు మైసమ్మ ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నాల్గవ వార్డు భాజపా అభ్యర్థి పుటాన్కర్ భార్గవి స్వప్నిల్‌కు మద్దతుగా గల్లీలో ప్రచారం



నిర్వహించారు. గత ప్రభుత్వ పాలకులు వార్డును అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారని, వార్డులు బోధన్ పట్టణం అభివృద్ధి చెందాలంటే బిజెపి పార్టీ బలపర్చిన అభ్యర్థులకు ఓటు వేసి భారీ మేజార్టీతో గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను ప్రజలు నిలదీయాలని కోరారు. భారతీయ జనతా పార్టీతోనే పట్టణం మార్పు చెందుతుందని అన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా కృషి చేస్తామన్నారు.

## రమాబాయి జయంతి పోస్టర్ ఆవిష్కరణ..

**ప్రజాపక్షం/ముధోల్ :** రాజ్యాంగ రచయిత అంబేద్కర్ సతీమణి రమాబాయి 128వ జయంతి వేడుకలను మండల కేంద్రంలోని నాగ్ సేన్ నగర్ బుద్ధవిహార్ ఆవరణలో ఈ నెల 9న నిర్వహిస్తున్నామని భీమ్ సేన యూత్ సభ్యులు అన్నారు.స్థానిక సర్పంచ్ షబానా ఎజాజ్ ఉద్దీన్,ఉప సర్పంచ్ కోరి లావణ్య సాయినాథ్ కలసి గోడ పత్రికలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా భీమ్ సేన యూత్ సభ్యులు మాట్లడుతూ సాయంత్రం మారాఠీ గాయకురాలు నిషా దొండ్గే,తో పాటు సాయిల్ భారతి మరాఠీ భీమ్ గీతాల కార్యక్రమం ఉంటాయని తెలిపారు.పరిసర గ్రామాలు నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చి కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బైంసా మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామ్‌నాథ్ రాథోడ్,వార్డ్ సభ్యులు విశ్వంబర్,యూత్ సభ్యులు అంకుష్,నగేష్, ఆమోల్, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ మార్పు కోసం 'జాడు' పట్టాల్సిందే ఇంటింటి ప్రచారంలో రేష్మ హాలీం జోరు



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ మున్సిపలిటీలో దశాబ్దాలుగా పేరుకుపోయిన సమస్యలకు చరమగీతం పాడాలంటే రాజకీయ మార్పు రావాలని,సామాన్యుడికి అండగా నిలిచే పాలనే లక్ష్యంగా ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)అభ్యర్థి రేష్మ హాలీం తన ప్రచారాన్ని ముమ్మరం చేశారు.శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో నిర్వహించిన గడప గడపకు ఆమ్ ఆద్మీ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సయ్యద్ హైదర్ స్వయంగా పాల్గొని రేష్మ హాలీం గెలుపును కాంక్షిస్తూ ఇంటింటికీ తిరగి ఓట్లు అభ్యర్థించారు.ఈ సందర్భంగా సయ్యద్ హైదర్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఇక్కడ పాలించిన పార్టీలు ఓట్లు దండుకోవడంపై చూపిన శ్రద్ధ సామాన్యుడి కనీస అవసరాల పట్ల చూపలేదని విమర్శించారు.ఢిల్లీ,పంజాబ్ రాష్ట్రాల్లో ఆమ్ ఆద్మీ పార్టీ అములు చేస్తున్న అద్భుతమైన అభివృద్ధి నమూనా నిర్మల్ గడ్డపై సాధ్యం కావాలంటే అది కేవలం పోరక గుర్తుతోనే సాధ్యమని ఆయన పిలుపునిచ్చారు.రేష్మ హాలీం వంటి విద్యావంతులు,ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తులు చట్టసభుల్లోకి వెళ్లినప్పుడే సామాన్యుడి గొంతు వినిపిస్తుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు,స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని రేష్మ హాలీంకు బ్రహ్మరథం పట్టారు.

## ఎన్నికల ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత కీలకం

**అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్..**

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత కీలకమని అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్ అన్నారు.శుక్రవారం,కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో మైక్రో అబ్జర్వర్లకు రెండవ విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ శిక్షణ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మైక్రో అబ్జర్వర్లుగా విధులు నిర్వర్తించే అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.శిక్షణలో,శిక్షకులు అందించే వివరాలను సమగ్రంగా తెలుసుకొని ఎన్నికల్లో విధుల్లో పాల్గొనాలని అన్నారు.సిబ్బందికి సమయపాలన క్రమశిక్షణ అత్యంత కీలకమని గుర్తు చేశారు.బాధ్యతాయుతంగా తమ విధులు నిర్వర్తించి,ఎన్నికల ప్రక్రియను మొత్తం దిగ్విజయంగా పూర్తి చేయాలని తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమంలో డీఈవో భోజన్న,ఎల్డీఎం రామ్ గోపాల్,శిక్షకులు, పాల్గొన్నారు.



# 12 న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

-రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోట్లను రద్దు చేయాలని విద్యుత్ సవరణ చట్టం 2025, విబిజి రాంజీ చట్టం, విత్తన సవరణ బిల్లు, ఎల్ఐసి లో 100% విదేశీ పెట్టుబడులను అనుమతించడం లాంటి ప్రమాదకరమైన నిర్ణయాలను ఉపసంహరించాలని కార్మిక ప్రజా రైతు వ్యవసాయ కూలీ వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాలు ఈనెల 12న జరిగే జరిపే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె గ్రామీణ బంధులో జగిత్యాల కార్మిక రైతు వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున భాగ స్వామ్యం కావాలని, ఈ సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ పిలుపునిచ్చారు. వామపక్ష కార్మిక సంఘాల సమన్వయ సమావేశం జగిత్యాల పట్టణంలో శుక్రవారం ప్రజాసంఘాల ఆఫీసులో నిర్వహించారు. ఇందూరి సులోచన అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన లెల్లెల బాలకృష్ణ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను అమలులోకి తీసుకొస్తున్నదని ఆయన అన్నారు.లేబర్ కోడ్ల ద్వారా కార్మిక శాఖను యజమానుల శాఖగా మార్చితే కార్మికవర్గం తీవ్ర దోపిడీకి గురి అవుతారని అన్నారు. నూతన లేబర్ కోడ్ లు అమలులోకి వస్తే కార్మిక వర్గ చట్టాలను సక్రమంగా అమలు చేయడానికి, తనిఖీలు చేయడానికి కార్మిక వివాదాలలో జోక్యం చేసుకొని యాజమాన్యానికి కార్మిక సంఘాలకు మధ్యవర్తిత్వం చేయడం తీర్పులివ్వడం వంటి హక్కులు రద్దు అవుతాయని లెల్లెల బాలకృష్ణ తెలిపారు. లేబర్ కోడ్ లు అమలులోకి వస్తే కార్మిక శాఖ తన అధికారాలను కోల్పోతుందని తనిఖీల వ్యవస్థకు కాలం చెల్లుతుందని, తనిఖీలు చేసి యజమానులను కట్టడి చేయవలసిన కార్మిక శాఖ యజమానుల సేవలలో తరిస్తుందన్నారు. కోడ్లులు అమలులోకి వస్తే మానవీయ పని పరిస్థితులు, జీవించేందుకు సరిపడా వేతన భరోసా, మంచి జీవితం, తగిన విరామం లాంటి బాధ్యతలన్నింటిని కార్మిక శాఖ పక్కన పెట్టే అవకాశం ఉంటుందని లెల్లెల బాలకృష్ణ అన్నారు. యాజమాన్యాలు అన్ని చట్టాలని అమలు జరుపుతున్నామని తమకు తాము సెల్ఫ్ సర్టిఫికేషన్ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్మిక చట్టాల అమలు గురించి ప్రభుత్వం నియంత్రణ లేకపోతే కార్మికుల పరిస్థితిని ఎంత దయ



నీయంగా ఉంటుందో అర్థం చేసుకోవాలన్నారు. కార్మికుల హక్కులు, సంక్షేమం యజమానుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్లను రిజిస్ట్రేషన్ చేయడం కష్టమైపోతుందని, సమ్మె చేయడం సాధ్యం కానీ పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కార్మిక వర్గ సంఘాటీత శక్తి బలహీనపడుతుందని లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఇందూరి సులోచన, జిల్లా కార్యదర్శి కోమటి చంద్రశేఖర్, జిల్లా కోశాధికారి వెలుమల పల్లి వెంకటాచారి, టి.యు.సి.ఐ జిల్లా నాయకులు ఆరేళ్ల భీమయ్య, మధ్యాహ్న భోజన నాయకులు పద్మ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## పుర కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్




**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి పురపాలక సంఘం కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ ను ఏర్పాటు చేసున్నట్లు మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాసరావు తెలిపారు.ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు ఈనెల 8 ఆదివారం రోజున ఉదయం 10 గంటలనుండి సాయంత్రం 5 గంటల వరకు ఓటుహక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవాల్సిగా సూచించారు. దీనికి గాను ఫారం 12 ద్వారా తమ పూర్తి వివరాలను కార్యాలయంలో సమర్పించి పోస్టల్ బ్యాలెట్ ను తీసుకోవాలని కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు.

## మధ్యాహ్న భోజనాన్ని.. పరిశీలించిన తహసీల్దార్



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ ను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసిల్దార్ బి ఎస్.ఎస్ వరప్రసాద్ శుక్రవారం సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం మిడ్ డే మీల్స్ కు సంబంధించి రికార్డులను తనిఖీ చేసి వంటశాల తో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు సూచించారు.అనంతరం విద్యార్థులతో కలిసి తహసిల్దార్ వరప్రసాద్ సహపంక్తి భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రావణ్ ,తదితరులు పాల్గొన్నారు.

## స్వామివారి సేవలో.. భోగ శ్రావణి



**ప్రజాపక్షం / సారంగాపూర్ :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం బీర్పూర్ శ్రీ లక్ష్మి నర్సింహ స్వామి వారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఈ మేరకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ భోగ శ్రావణి ప్రవీణ్ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట నాయకులు పాత రమేష్, గర్షకుర్తి రమేష్, మధురవేని మహేష్ యాదవ్, పెండ్యాల ప్రతాప్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత పశు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని దమ్మణపేట, దట్నూర్ గ్రామాలలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించడం జరిగింది.ఈ ఉచిత పశు వైద్య శిబిరాలను దమణపేట, దట్నూర్ గ్రామాల సర్పంచ్ లు ముదాం గౌతమి, బేక్కం గంగారాం,ఉపసర్పంచ్ లు మామిడిపల్లి రమేష్, జక్కుల తిరుపతి లు పాల్గొని ప్రారంభించారు.ఈ శిబిరంలో మండల పశు వైద్యాధికారులు డాక్టర్స్ రవీందర్,తిరుపతి గౌడ్ పశువులకు గర్భ కోశ వ్యాధులకు చికిత్సలు చేసి పశువులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మండల పశు వైద్యాధికారి రవీందర్ మాట్లాడుతూ పాడి రైతులు పశు సంతతి పెంచుకోవడం కోసం పశువులకు,గర్భకోశ వ్యాధి చికిత్స చేయించుకోవాలి, ఎదకు రాని పశువులకు తగిన మందులు వాడుకోవాలి అన్నారు.పశుగణాభివృద్ధి సంస్థ జిల్లా సూపర్వైజర్ నర్సయ్య మాట్లాడుతూ చలికాలంలో పశువులు ఎదకు వస్తాయి కాబట్టి మీరు సకాలంలో గుర్తించి అందుబాటులో



ఉన్న పశువైద్యశిబ్బందిచే గోపాల మిత్రుల ద్వారా కృత్రిమ గర్భాదారణ చేయించినట్లయితే మంచి మేలు జాతి రకపు దూడలు పుడతాయని తెలిపారు.జన్మించిన దూడలకు 15 రోజుల నుండి నట్టల నివారణ మందును త్రాగించడం వలన దూడలు ఆరోగ్యంగా ఉంటాయని అన్నారు. దమన్నపేట ,దట్నూర్ గ్రామా పంచాయతీ కార్యదర్శులు వెంకటేష్ గౌడ్, నరేష్ ,గోపాల మిత్రులు శ్రీకాంత్ ,రవీందర్, రమేష్,నరహరి,వార్డు సభ్యులు,పాడి రైతులు, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

## రేచపల్లి రైతుల బాధలు పట్టించుకోండి

**ప్రజాపక్షం / సారంగాపూర్ :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని ఉమ్మడి రేచపల్లి గ్రామంలో తక్షణమే అగ్రికల్చర్ క్లస్టర ఏర్పాటు చేయాలని గ్రామ సర్పంచ్ బాస మహేష్ శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారికి వినతి పత్రం సమర్పించారు. నాలుగు గ్రామపంచాయతీలతో కూడిన ఉమ్మడి రేచపల్లిలో 10వేల మందికి పైగా జనాభా, 5వేల ఎకరాలకు మించి సాగు భూములు ఉన్నప్పటికి, ఇప్పటికి కనీస వ్యవసాయ మౌళిక సదుపాయాలు లేకపోవడం దురదృష్టకరమని గ్రామ సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల అవసరాలను పరిగణనలోకి తీసుకుని రేచపల్లిని అగ్రికల్చర్ క్లస్టర్గా ప్రకటించి తక్షణ చర్యలు చేపట్టాలని జగిత్యాల జిల్లా వ్యవసాయ శాఖను సర్పంచ్ బాస మహేష్ కోరారు.

## మజీద్‌ల అభివృద్ధికి మాసూమ్‌అలీ చేయూత

**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల కేంద్రంలోని మజీద్ అభివృద్ధికి మహ్మద్ మాసూమ్ అలీ, అహ్మద్ బి సాహిబా గ్రూప్ వారు చేయూతను అందించారు. మజీదులో నిర్మిస్తున్న పలు నిర్మాణాలకు వారు ఆర్థిక సాయం అందజేశారు. మహ్మద్ మాసూమ్ అలీని మజీద్ పెద్దలు, కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. ఎన్.ఆర్.ఐ. అయిన మాసూమ్ అలీ గత పదేళ్లుగా రామగుండం పట్టణంతోపాటు పలు ప్రాంతాల్లో మజీద్‌ల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలను అందిస్తున్నారు. అంతర్గాం, గోయల్‌వాడ, పొట్యాల మజీద్‌ల్లోని ముగ్గురు ఇమామ్‌లకు ప్రతి నెల రూ.15 వేలు గౌరవ పారితోషికాన్ని అందజేస్తున్నారు.



## గర్భిణీ స్త్రీలు ప్రభుత్వ ఆసుపత్రులను వినియోగించుకోవాలి

సర్పంచ్ జంగా శిరీష వెంకటరమణారెడ్డి

**ప్రజాపక్షం/చిగురుమామిడి:** మండల పరిధిలోని సుందరగిరి గ్రామంలో శుక్రవారం అంగన్‌వాడీ మూడవ కేంద్రంలో శుక్రవారం సభ జరిగింద. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ జంగ శిరీష వెంకటరమణారెడ్డి హాజరై మాట్లాడారు. గర్భిణీస్త్రీలు పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఆహార నియమాలను పాటించాలన్నారు. పోషక ఆహారం తీసుకోవడం వల్ల పండంటి బిడ్డకు జన్మనివ్వడం జరుగుతుందని తెలిపారు. బాలింతలు బిడ్డలకు సరైన పోషక ఆహారాన్ని ఇవ్వాలన్నారు. ప్రభుత్వం గర్భిణీస్త్రీలకు ఆసుపత్రులలో అన్ని వసతులు కల్పించిందని చెప్పారు. ప్రైవేట్ ఆసుపత్రులను సంప్రదించి ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు.



అంగన్‌వాడీ సెంటర్లలో అందించే ఆహారపదార్థాలను పిల్లలకు తినపెట్టాలన్నారు. వార్డు మెంబర్ వంతడుపుల దిలీప్, పెసరి రాజకృష్ణ, మంతెన ప్రియాంక, ఎనగందుల రాజేశ్వరి, నిర్మల జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు బి.శోభ, జి.రాజమణి, వి.రాజమణి, ఆశాలు శోభ, శ్వేత, స్రవంతి, అనురాధ తదితరులున్నారు.

## ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వం

- మడ్డి సాయి కోశోర్ గౌడ్

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వం అని చాటిచెప్పారు యువ నాయకులు మడ్డి సాయికిషోర్ గౌడ్.సుల్తానాబాద్ మండలం ఐతరాజుపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబ సభ్యుడు న్యాతరి రాజయ్య ఇటీవల మరణించారు.ఈ విషయం తెలుసుకున్న మడ్డి సాయికిషోర్ గౌడ్, కల్వల ప్రభాకర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి మనోధైర్యాన్ని కల్పించి కుటుంబ దీనస్థితిని గమనించి తక్షణ సహాయంగా మడ్డి సాయికిషోర్ గౌడ్ 3,000/ కల్వల ప్రభాకర్ 2,000/ మొత్తం 5,000/ రూపాయలను అందజేశారు. గ్రామంలో ఏ నిరుపేద కుటుంబానికి ఆపద వచ్చినా, కష్టాల్లో ఉన్నా ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని తెలియజేసారు. ఈర్ల రమేష్,రాజశేఖర్, రామకృష్ణ, అజయ్,అరవింద్, కార్తీక్ మరియు పాల్గొని మృతుని కుటుంబానికి సానుభూతి తెలిపారు.

## కాంగ్రెస్ పాలనలోనే నిజమైన అభివృద్ధి

**ప్రజాపక్షం/రామగుండం :** కాంగ్రెస్ పార్టీ పాలనలోనే నిజమైన అభివృద్ధి సాధ్యమౌతుందని, ప్రజా సమస్యలపై స్పష్టమైన దృష్టితో పనిచేసే పార్టీ కాంగ్రెస్ అని రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రామగుండం పట్టణంలోని 25, 26, 27, 28, 29, 30వ డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం లింగాపూర్, విలేజి రామగుండం, రైల్వేస్టేషన్ ఏరియా, రామగుండం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. రానున్న రోజుల్లో ప్రతి డివిజన్‌లో మరింత వేగంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను ఎమ్మెల్యే కోరారు.

